క్లుప్తంగా

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 21, 30 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే రోడ్లపై అక్కడక్కడ చెత్త పడి ఉండటాన్ని గమనించి కొంత అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ మాధవరావుకు బంగారు పతకం



తెనాలిరూరల్: పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు దివంగత డాక్టర్ కొత్త రవీంద్రబాబు స్మారక ధార్మిక బంగారు పతకాన్ని గుంటూరుకు చెందిన ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ దూపగుంట్ల వెంకట మాధరావుకు బహుకరించారు. ఈ సందర్భంగా బెనైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లాసియా' అన్న ఆరోగ్య సమస్య వైద్య విధానం గురించి డాక్టర్ వెంకట మాధవరావు ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావనిప్రియాంక, డాక్టర్ కొత్త రవీంద్రబాబు కుటుంబసభ్యులు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

23న ఉపాధి హామీ పథకం గ్రామ సభలు

తాడికొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై చర్చించి ప్రతిపాదించేందుకు ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి మంగళవారం విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ గ్రామసభకు తాడికొండకు నోడల్ ఆఫీసర్లుగా ఎంపీడీఓ అత్తోట దీప్తి, నిడుముక్కలకు తహసీల్దార్ నాసరయ్య, లాం గ్రామానికి ఈఓపీఆర్డీ సిహెచ్. వెంకటేశ్వర్లు, పొన్నెకల్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ ఐ.ఓబుల్ రెడ్డి, మోతడకకు పీఆర్ ఏఈఈ వై.శ్రీనివాస కుమార్, బేజాత్పురం విద్యుత్ ఏఈఈ వెంకట రవికుమార్, గరికపాడు వెలుగు సీసీ రాఘవ, రావెలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శ్రీలత, పాములపాడుకు వెలుగు ఏపీఎం ఆర్.సాంబశివరావు, లచ్చన్నగుడిపూడికి సీహెచ్ నాగ శ్రీనివాస్, ఫణిదరంకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.శ్రీదేవి, ముక్కామలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీ.హెచ్.కళావతి, కంతేరుకు ఏఎస్ఓ శ్రీధర్, బండారుపల్లికి ఎంఈఓ-1 టి.ఇందిర, దామరపల్లికి ఎంఈఓ-2 డి.ప్రభాకర్‌రావులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామసభ నిర్వహించి చర్చించిన అంశాలపై తీర్మానం చేయనున్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

తాడికొండ: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఏఐ విభాగంలోని సిటీ టెక్నోసార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అనాథలు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ పలు ప్రాంతాలలో ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమాజ సేవకు నడుం బిగించిన విద్యార్థులను కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ పి.ఫణికుమార్, ఏఐ హెచ్ఓడీ సుంకర శాంతి ప్రియ అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని రత్నాల చెరువు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్, బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల అక్రమ రవాణ, హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగమణి, ఇశ్రాయిల్, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌చే డయేరియాపై అవగాహన



మాట్లాడుతున్న గ్రామసర్పంచ్ కాకి రమాదేవి

తెనాలి: రూరల్ మండల గ్రామం పెదరావూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జల జీవన మిషన్–డీపీఎంయూ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని పి.సరళ అధ్యక్షత వహించారు. జల జీవన మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.తేజ్ సంగీత్ మాట్లాడుతూ ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈగలు వాలిన ఆహార పదార్థాలను తినరాదని చెప్పారు. భోజనం చేసే ముందు, మల విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడగాలని చెప్పారు. ప్రతిరోజు గోరువెచ్చని నీటిని తాగినట్టయితే జీర్ణక్రియ బాగుంటుందని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే డయేరియా వంటి సీజనల్ వ్యాధులు దరిచేరవని చెప్పారు. బ్లీచింగ్ పౌడర్ కలిపి క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. డయేరియా వచ్చినప్పుడు తప్పని సరిగా డాక్టరును సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని, తక్షణం ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. గ్రామ సర్పంచి కాకి రమాదేవి మాట్లాడుతూ గ్రామంలో డయేరియా లాంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు, విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తున్నామని తెలియజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వ సంస్థల్లో క్లోరినేషన్ చేసిన నీటిని అందించడానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని పి.సరళ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి సామాజిక అంశాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ కళ, జ్యోతి, దీపికలు చేతుల పరిశుభ్రతను ప్రాక్టికల్‌గా చూపారు. విద్యార్థులతో చేయించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ ఆటోల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న ఆర్టీవో రాఘవరావు

తెనాలిరూరల్: తెనాలిలో ఆటోల తనిఖీల స్పెషల్ డ్రైవ్‌ను రవాణా శాఖ అధికారులు మంగళవారం చేపట్టారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవ రావు తమ సిబ్బందితో కలసి ఆటోలను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్కూల్ ఆటోల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని, డ్రైవర్ వెంబడి, వెనుక డోర్ తెరచి విద్యార్థులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్ బాక్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడన్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ప్రయాణికుల ఆటోలకు వెనుక డోర్ తీయకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూదని స్పష్టం చేశారు. ఓవర్ లోడ్‌తో వెళుతున్న స్కూల్ ఆటో, లైసెన్సు లేకుండాడ ఆటోలను నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లను గుర్తించి రూ. 20 వేలు జరిమానా విధించారు.

మానసిక పరిశుద్ధతతో భగవంతుడి దివ్యగుణాలు

బ్రహ్మకుమారీస్ సిస్టర్ సునంద



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అతిథులు

తెనాలి: ప్రతిఒక్కరూ ఆత్మస్వరూపులేనని, భగవంతుడు ప్రతి హృదయంలో విరాజమానుడై ఉన్నాడనీ, ఆయన దివ్యగుణాలను స్మరించుకుంటూ అందరూ పరమాత్మలో లీనమయి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం, తెనాలి శాఖ నిర్వాహకురాలు సిస్టర్ సునంద సూచించారు. చేసే ప్రతి పనినీ భగవంతుని స్మరించుకుంటూ సంతోషంగా చేసినట్టయితే అన్నీ విజయాలే సాధిస్తారని చెప్పారు. రక్షాబంధన్ సందర్భంగా వివేక మహిళా కళాశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిస్టర్ సునంద మాట్లాడారు. ధ్యానంతో ఆత్మపరిశీలన చేసుకుని, పరిశుద్ధతను, పూర్ణత్వాన్ని పొందినట్టయితే దివ్య గుణాలు అలవడి, భగవంతుడికి చేరువ కావొచ్చని బ్రహ్మకుమారీస్ సిస్టర్ తులసి వెల్లడించారు. ధ్యానం సందర్భంగా ఎలాంటి శ్రద్ధ వహించాలి? ఎలాంటి ఆలోచనలను మనసులో ప్రతిష్ఠించుకోవాలి? అనేది బ్రహ్మకుమారీస్ సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు వివరించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ, రాజస్థాన్‌లోని మౌంట్ అబూ కేంద్రంగా బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ప్రపంచవ్యాప్తంగా సర్వమానవ సౌభ్రాత్రత్వాన్ని ఆకాంక్షిస్తూ సేవలను అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా వివేక మహిళా కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రియాంక, భవాని ప్రియాంక, భావన, ఠాగూర్, మురళి, నాగేశ్వరరావులు అతిథులను సత్కరించారు.

సాంఘిక నాటకానికి కరదీపిక కన్నెగంటి నాసరయ్య



కన్నెగంటి నాసరయ్యకు కళాకారుల పుష్పాంజలి

తెనాలి: ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు కన్నెగంటి నాసరయ్య తెలుగు సాంఘిక నాటకరంగానికి కరదీపికగా మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం కన్నెగంటి నాసరయ్య 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. దిలీప్‌రాజా మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమ కాలంలో బుర్రకథ దళంతో నాటి ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని కలిగించిన నాసరయ్య, దేశానికి స్వతంత్ర్యం లభించాక, జనతా థియేటర్ పేరుతో నాటక సమాజాన్ని స్థాపించి, ప్రజాచైతన్యానికి దశాబ్దాలపాటు కృషిచేశారని చెప్పారు. ఆయన పరిచయం చేసిన ఎందరో నటులు తర్వాత కాలంలో సినీరంగంలో రాణించారని సోదాహరణంగా చెప్పారు. సాంఘిక నాటకానికి నాసరయ్య చేసిన చిరస్మరణీయమన్నారు. అందుకు ప్రతిఫలంగా సమాజం కూడా ఆయన స్మారకార్థం ఏదొకటి చేయాలని ఆకాంక్షను వ్యక్తంచేశారు.

పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు పరిషత్ పోటీల్లో నాల్గొన్న నాసరయ్య అనేక బహుమతులను సాధించారని గుర్తుచేసుకున్నారు. సాంఘిక నాటకానికి ఆయన చేసిన సేవలు అపూర్వమని, ఎందరో కళాకారులను రంగస్థలానికి పరిచయం చేశారని చెప్పారు. పట్టణానికి చెందిన కవి పాతూరి సుబ్రహ్మణ్యం తన ప్రసంగంలో నాసరయ్య కళారంగ సేవను గురించి వివరించారు. కళాకారులు బెజ్జంకి నాగమణి, హైమావతి, బొల్లిముంత కృష్ణ, లక్కరాజు లక్ష్మణరావు, రంగిశెట్టి రమేష్, దీపాల సుబ్రహ్మణ్యం, పందిటి సుబ్బారావు, వినుకొండ శ్రీరామమూర్తి, ఆర్అండ్‌బీ రాజు, చందు సుబ్బారావు, చిట్టూరి సీతారామయ్య, మాదల కోటేశ్వరరావు, కన్నెగంటి గోపయ్య, కొండముది రమేష్ తదితరులు మాట్లాడారు. కన్నెగంటి మధు, కన్నెగంటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. తొలుత నాసరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఇంటింటి సర్వేకి బీఎల్‌ఏలు అందుబాటులో ఉండాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ గోపాలకృష్ణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులపై జరుగనున్న ఇంటింటి సర్వేకి బూత్ లెవల్ ఆఫీసర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) అందుబాటులో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ సమావేశమయ్యారు. బీఎల్‌వోల ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ వరకు నియోజకవర్గంలో ఇంటింటి ఓటరు సర్వే జరుగుతుందని, గతంలో తొలగించిన కొన్ని పోలింగ్ కేంద్రాలను తిరిగి ఏర్పాటు చేయడం, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రెండో శనివారం, అన్ని ఆదివారాలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, సర్వేలో వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు 24లోగా పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీలు ఇంకొంతమంది బీఎల్‌ఏలను నియమించాల్సి ఉందని, అలానే అన్ని రాజీకాయ పార్టీలు బీఎల్‌ఏలను నియమించి సర్వేకు సహకరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, వివిధ రాజకీయ పర్టీల ప్రతినిధులు కాళిదాసు వెంకటేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, పాన్నూరు నాగసూర్యశశిధరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

తెనాలిరూరల్: గ్రామాల్లో లబ్ధిదారుల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, హౌసింగ్ డీఈ రఫీవుల్లా ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు తోపుడుబండ్ల బహూకరణ

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం 22 మంది చిరువ్యాపారులకు తోపుడుబండ్లను బహూకరించనున్నారు. రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్, మొయినాబాద్, వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్, తెనాలి సహకారంతో చేపట్టిన వితరణను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని ఉదయ్ సుధీర్ పిలని, వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, అన్నే రత్నప్రభాకర్, తాళ్ల రాజశేఖర రెడ్డి, పాటిబండ్ల శివరంజని, డాక్టర్ మలినేని పెరుమాళ్లు పాల్గొంటారు. రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, సర్వీస్ ప్రాజెక్ట్ ఛైర్ నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్ కుమార్ జైన్ బన్సాలి పర్యవేక్షిస్తారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడికొండ: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. తుళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన బండారు ఏసురత్నం(37) భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో సోమవారం గ్రామ శివారు నీటి గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహం బయట పడటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడి అరెస్ట్

మంగళగిరి: 2018లో మంగళగిరిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నిందితుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కడపకు చెందిన బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడుగా ఉన్నాడు. కేసు కోర్టులో నడుస్తుండగా కోర్టుకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. కోర్టు నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేయగా మంగళవారం కడపలో ఉన్న నిందితుడు బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్న కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

జాతీయ పోటీలకు ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపిక

మంగళగిరి: కోల్‌కతాలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీనియర్ నేషనల్ మెన్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపికయినట్లు అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో 57 కేజీల విభాగంలో షేక్ సాదియా ఆల్మాస్, 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రిక, షేక్ షబ్బీనా ఎంపికయినట్లు తెలిపారు.

డయేరియాపై విద్యార్థులకు అవగాహన



చేతులు కడిగే విధానాన్ని వివరిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు

తెనాలిరూరల్: జలల్ జీవన మిషన్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (డీపీఎంయూ) ఆధ్వర్యంలో మండల గ్రామం పెదరావూరులోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు డయేరియా నివారణ, చికిత్స విధానాలపై మంగళవారం అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పి. తేజ్‌సంగీత్ మాట్లాడుతూ అన్నం తినడానికి ముందు మల విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడగాలని చెప్పారు. వేడిగా ఉన్న పౌష్టిక ఆహారం తినాలని, ఈగలు వాలిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు గోరువెచ్చని నీటిని తాగడం ద్వారా జీర్ణ క్రియ బాగా పనిచేస్తుందని తెలియజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నుండి విముక్తి పొందవచ్చని చెప్పారు. ఈ అతిసారా వ్యాధి బారిన పడినప్పుడు తప్పనిసరిగా డాక్టరును సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకుంటూ ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచి కాకి రమాదేవి మాట్లాడుతూ గ్రామంలో డయేరియా వ్యాధి లాంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను, విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏడు రకాలైన హ్యాండ్ వాష్ విధానాలను చేసి చూపించారు కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇమ్రాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మి కళ, జ్యోతి, దీపిక, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాను దేశం నుంచి పారద్రోలుదాం

జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సుబ్బరాయణం, డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: 2030 నాటికి మలేరియా రహిత భారతదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణలు పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుర్రిపాలెం రోడ్డులోని మలేరియా కార్యాలయం నుంచి మంగళవారం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చెడు గాలి వలన మలేరియా సోకుతుందని భావించేవారని, అనంతరం సర్ రోనాల్డ్ రాస్ శాస్త్రవేత్త పరిశోధనల అనంతరం ఆడ అనాఫిలిస్‌దోమ కాటు వల్ల ఇది సోకుతుందని నిర్ధారించినట్లు తెలిపారు. ఆయన చేసిన పరిశోధన వలన ప్రభుత్వం నోబెల్ బహు మతి ఇచ్చిందని చెప్పారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉండటం వలన దోమల సంతతి పెరిగే అవకాశం ఉందన్నారు. మలేరియాను దేశంలో దాదాపు నిర్మూలించడం జరిగిందన్నారు.

2027 నాటికి జీరో కేసులు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలా మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బీబీ జాన్, మార్తా నర్సింగ్ కాలేజ్ కరస్పాండెంట్ యనమాల ఈశ్వర్, మున్సిపల్ బాలురోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబి, ఎన్‌సీసీ అధికారులు సర్దార్, బెల్లంకొండ వెంకట్, గోవర్ధని, మలేరియా అధికారులు దారావత్ రాజునాయక్, చరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, గుద్దంటి రవికుమార్, శివగణేష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించండి

కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణ పరిధిలోని ఓటర్ల జాబితాకు అనుగుణంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, పేరు, ఇంటి పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి సవరణలకు సంబంధించిన వివరాలు సేకరించాలని సూచించారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ పరిధిలో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బూత్ పరిధిలో వివరాలు సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తెనాలిరూరల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 80వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మారిస్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ అతి చిన్న వయస్సులోనే దేశ ప్రధాని పీఠం ఎక్కారని అన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని పదవి చేపట్టిన రాజీవ్ గాంధీ సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. తదనంతర ఎన్నికల్లో 411 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి ప్రధానిగా ఎన్నికయ్యారని తెలిపారు. రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవ చేశారని, ఐటీ రంగాన్ని దేశంలో ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, తెనాలి మండల ప్రెసిడెంట్ కర్లపూడి బుల్లియ్య, మాదాల పూర్ణచంద్రరావు, పి. శివకుమార్, పి. స్టీవెన్ బాబు, ఎ. కృష్ణ, ఎస్. సుబ్బారావు, చందు అయ్యప్ప, బి. శ్రీను, పూలె రామ్, వై. శంకరరావు పాల్గొన్నారు.

'కమిటీ కుర్రోళ్లు' విజయవంతం కావడం సంతోషం

చిత్రనిర్మాత, సినీనటి నిహారిక కొణిదెల



మాట్లాడుతున్న నిహారిక కొణిదెల

తెనాలి: నిహారిక ప్రొడక్షన్స్ పేరుతో తాను నిర్మాతగా నిర్మించిన తొలి సినిమా 'కమిటీ కుర్రోళ్లు' విజయవంతం కావటం సంతోషంగా ఉందని, ఆ చిత్ర నిర్మాత, సినీనటి నిహారిక కొణిదెల అన్నారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ప్రదర్శిస్తున్న స్థానిక ప్రియా కాంప్లెక్సుకు ఆమె, చిత్ర యూనిట్‌తో కలిసి మంగళవారం వచ్చారు. థియేటర్‌లోకి ప్రవేశించగానే తెనాలి రావటం సంతోషంగా ఉందన్న నిహారిక మాటలకు ప్రేక్షకులు జేజేలు కొట్టారు. ఫ్యామిలీ మెంబర్స్ అని కాకుండా మంచి సినిమా ఏదైనా తన పెదనాన్న మెగాస్టార్ చిరంజీవి చూస్తారని, ఆవిధంగా 'కమిటీ కుర్రోళ్లు' చూశాక, తమను పిలిచి అభినందించటం సంతోషకరమని చెప్పారు. బాబాయ్ పవన్ కళ్యాణ్ బిజీగా ఉండటంతో చూడలేదన్నారు. త్వరలోనే సమయం తీసుకుంటానని చెప్పారు. పెదనాన్న చిరంజీవి స్ఫూర్తితోనే తాను సినీ రంగంలోకి వచ్చినట్టు నిహారిక తెలిపారు. తాను నిర్మించిన తొలి సినిమా 'కమిటీ కుర్రోళ్లు'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. రాయపాటి అరుణ మాట్లాడుతూ తన అన్నయ్య నాగబాబు కుమార్తె నిహారిక నిర్మాతగా సినిమా తీయటం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో పరిణామాలను సినిమాలో కళ్లకు కట్టారని చెప్పారు. ఓటు హక్కును దుర్వినియోగం చేస్తే ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయో? అన్నది కూడా సినిమాలో ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయవంతమైన సినిమాలు తీయాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. సినిమా దర్శకుడు యధువంశీ మాట్లాడుతూ తమ సినిమా 'కమిటీ కుర్రోళ్ల'కు చాలాచోట్ల థియేటర్లు దొరకలేదన్నారు. తెనాలిలో మంచి థియేటరు దొరకటం ఆనందకరమన్నారు. సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సినిమాలో నటించిన సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రచ్చిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్‌కుమార్ పరిమి, శ్యామ్‌కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్టా, అక్షయ్ శ్రీనివాసర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మన్యం రమేష్ పాల్గొన్నారు. ప్రియా కాంప్లెక్స్ మేనేజరు దాసరి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. జనసేన, టీడీపీ, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో ఇప్పటంలో కల్లుగీత కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. డీఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ 28 మార్చి, 2024వ తేదీన కల్లుగీత కార్మికుడు మోర్ల వెంకటేశ్వరరావు(44) తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తగిలి కిందపడి మృతి చెందాడని చెప్పారు. మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఏపీసీపీడీసీఎల్ సంస్థ తరపున మోర్ల వెంకటేశ్వరరావు భార్య మోర్ల లక్ష్మి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశామని, అందుకు సంబంధించిన పత్రాలను ఆమెకు అందజేసినట్లు ఆయన తెలిపారు.